సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం ׀ 9 ׀ సెప్టెంబర్ ׀ 2023



వాహన చోదకులకు కౌన్సెలింగ్

వాహన చోదకులకు జడ్డంగి ఎస్‌ఐ రఘు నాథరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. తనిఖీలు చేపట్టిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు.



అదుపు తప్పిన కారు

IIలో

లైడ జంగిల్స్ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన గోతిలో ముందుచక్రం దిగిపోవడం తో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



పోషకాహారం తప్పనిసరి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పలువురు పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు.

IIIలో

న్యూస్‌రీల్

డ్రైనేజి సమస్య పరిష్కరిస్తాం

● సబ్ కలెక్టర్ శుభం బన్సల్



డ్రైనేజీ సమస్యను సబ్‌కలెక్టర్‌కు వివరిస్తున్న స్థానికులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగిలో రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా తలెత్తిన డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. ఈ గ్రామం మీదుగా జరుగుతున్న ఎన్‌హెచ్ 516ఈ రోడ్ నిర్మాణ పనుల నేపథ్యంలో జరుగుతున్న డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణాలపై స్థానిక గిరిజనులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్వయంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన నేషనల్ హైవే అథారిటీ, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. డ్రైజేజీ ఏర్పాటు వల్ల ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తానని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. సర్పంచ్ మురళీకృష్ణ, స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సత్యన్నారాయణ, వీఆర్వో నానాజీ పాల్గొన్నారు.

గ్యాస్ లీక్.. పూరిల్లు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న పూరిల్లు

ఎటపాక: మండలంలోని నందిగామ గ్రామంలో గ్యాస్‌లీకై ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన పిన్నబోయిన ఈశ్వరయ్య తాటాకు ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఇంటిపై కప్పు తాటాకులకు మంటలు అంటుకుని ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని నిత్యావసర వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.లక్ష మేర ఆస్తినష్టం సంభవించింది.

పోలీసు అధికారులకు ఉత్కృష్ట్ సేవా పతకం

సాక్షి, అనకాపల్లి/పాడేరు: ఉత్కృష్ట్ సేవా పతకానికి పలువురు పోలీసు అధికారులు ఎంపికయ్యారు. బుచ్చెయ్యపేట ఎస్‌ఐ కె.కుమారస్వామి, బక్కన్నపాలెం సీఐ సింగారపు రామకృష్ణ, అరకు సీఐ సీహెచ్ రుద్ర శేఖర్‌లను ఈ అవార్డుకు ఎంపిక చేస్తూ రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

దుంబ్రిగుడ: మండలంలోని రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి చాపరాయి, సంపంగి గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో శుక్రవారం జరిగిన అరకు వారపు సంతకు గిరిజన రైతులు పంట ఉత్పత్తులను తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో ముగ్గురి అరెస్టు

వై.రామవరం: మండలంలోని బొడ్డపల్లి గ్రామ సమీపంలో బాలికపై జరిగిన లైంగికదాడి కేసులో గురువారం ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 3వ తేదీన ఆమెపై 16ఏళ్ల బాలుడు లైంగికదాడి చేయడం విధితమే. నిందితుడికి సహకరించిన మండలంలోని గండెంపల్లి గ్రామానికి చెందిన బందారు సన్యాసమ్మ (23), బొడ్డపల్లి గ్రామానికి చెందిన యాట్ల చిన్నబ్బాయిరెడ్డి (26) లను ముగ్గురిని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ఆధ్వర్యంలో గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వీరి ముగ్గురిపై ఫోక్సో చట్టప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరచనున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

108లో సుఖ ప్రసవం



అంబులెన్సులో ప్రసవించిన గర్భిణి దేవి

హుకుంపేట: మండలంలోని తడిగి గ్రామానికి చెందిన పూజారి దేవి అనే గర్భిణి గురువారం అర్ధరాత్రి 108లో మగ శిశువునకు జన్మనిచ్చింది. అర్ధరాత్రి ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో గర్భిణిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆమె ప్రసవించింది. వెంటనే తల్లీబిడ్డను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని ఈఎంటి శ్రీను తెలిపారు.

అభాగ్యులకు ఆసరా



గడుతూరులో కొత్త పింఛన్ల సొమ్ము పొందుతున్న లబ్ధిదారులు



దివ్యాంగుడు సింహాచలానికి కొత్త పింఛను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

- కొత్తగా 2,800 మందికి వివిధ రకాల పింఛన్ల మంజూరు
- 1,25,164కు చేరిన లబ్ధిదారుల సంఖ్య

సాక్షి,పాడేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్న వైఎస్సార్ పింఛను కానుక ఎంతోమంది పేదలకు ఆసరాగా నిలుస్తోంది. జిల్లాలో జిల్లాలో ఇప్పటివరకు 1,23,164 మంది వివిధ రకాల పింఛనుదారులు ఉన్నారు. కొత్తగా 2,800 మందికి పింఛన్ల మంజూరు అవడంతో 1,25,164 సంఖ్యకు చేరింది.

గత ప్రభుత్వంలో కాళ్లరిగేలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛను పొందాలంటే జన్మభూమి కమిటీలు, టీడీపీ నేతల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వెంటనే కొత్త పింఛన్ మంజూరవుతోంది. గత నెలలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ వారి అర్హతలను బట్టి 2,800 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి.

మండలాల వారీగా..

చింతపల్లిలో 250మంది, వై.రామవరంలో 205, జి.కే.వీధిలో 189, కొయ్యూరులో 185, దుంబ్రిగుడలో 165, హుకుంపేటలో 152, ఎటపాకలో 141, పాడేరులో 137, అరకులోయలో 133, అనంతగిరిలో 129, పెదబయలులో 128, జి.మాడుగులలో 127, ముంచంగిపుట్టులో 121, చింతూరులో 98, అడ్డతీగలలో 97, వీఆర్‌పురంలో 95, రంపచోడవరంలో 90, దేవీపట్నంలో 89, గంగవరంలో 85, రాజవొమ్మంగిలో 81, కూనవరంలో 62, మారేడుమిల్లిలో 41 మంది అర్హులకు పింఛన్ సొమ్మును పంపిణీ చేస్తున్నారు.

రూ.81,08,250 విడుదల

జిల్లాలోని 2800 కొత్త పింఛన్‌దారులకు ప్రభుత్వం రూ.81లక్షల 8వేల 250ను విడుదల చేసింది.వీరిలో డప్పు కళాకారుడు ఒకరికి రూ.3 వేలు, దివ్యాంగులు 472 మందికి రూ.లక్షా 41వేల 600, వృద్ధులు 1397 మందికి రూ.38లక్షల 41వేల 750, ఒంటరి మహిళలు ఐదుగురికి రూ.13వేల750,చేనేత కార్మికుడు ఒకరికి రూ.2750,కిడ్నీ డయాలసిస్ బాధితులు 8మందికి రూ.80వేలు(10 వేల చొప్పున), సికిల్‌సెల్ ఎనీమియా బాధితులు 32 మందికి రూ.3 లక్షల 20వేలు (రూ.10వేల చొప్పున)పింఛన్ సొమ్ము విడుదలైంది.

చాలా మేలు చేసింది



సికిల్‌సెల్ ఎనిమియాతో బాధపడుతున్నా.పౌష్టికాహారం, ఇతర ఆరోగ్య సేవలకు ఆర్థిక స్థోమత లేనందున ప్రతి నెలా ఇబ్బందులు పడుతున్నా. ప్రభుత్వం సికిల్‌సెల్ ఎనిమియా నిర్ధారణ పరీక్షలను సకాలంలో జరిపించడంతో పాటు ఈ నెల నుంచి రూ.10వేల చొప్పున పింఛన్ పంపిణీ చేస్తుండటం ఎంతో మేలు చేసింది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటా.

– తలారి భాస్కరరావు, సికిల్‌సెల్ ఎనీమియా పింఛనుదారుడు, సుజనకోట, ముంచంగిపుట్టు మండలం

సీఎస్ జవహర్‌రెడ్డికి ఘన స్వాగతం



సీఎస్ జవహర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పీవో సూరజ్ గనోరే



సీఎస్ జవహర్‌రెడ్డితో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రం పాడేరు చేరుకున్నారు. విశాఖ నుంచి రోడ్డు మార్గంలో పాడేరు చేరుకున్న ఆయనకు స్థానిక వంతాడపల్లి చెక్ పోస్టు వద్ద కలెక్టర్ సుమిత్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. అంతకుముందు విశాఖ ఎయిర్‌పోర్టులో పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. పీఎంఆర్‌సీ భవనంలోని అతిథి గృహానికి చేరుకున్న సీఎస్‌ను ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ శివశ్రీనివాస్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, పాడేరు ఏఎస్పీ ధీరజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇలావుండగా సీఎస్ జవహర్‌రెడ్డి శనివారం ఉదయం అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్లు, జేసీలు, ఎస్పీలు, ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు జిల్లా కేంద్రం పాడేరులో అందుబాటులో ఉన్నారు. సీఎస్ పాడేరు పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మోదకొండమ్మకు పూజలు..

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి శుక్రవారం రాత్రి సందర్శించారు. మోదమ్మను దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. పాడేరు, పార్వతీపురం కలెక్టర్లు సుమిత్‌కుమార్, నిషాంత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌లు కూడా మోదమ్మను దర్శించుకున్నారు. సీఎస్ జవహర్‌రెడ్డికి శాలువా కప్పి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు అందజేశారు.

సీఎస్ దృష్టికి సమస్యలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డిని శుక్రవారం రాత్రి పీఎంఆర్‌సీ అతిథి గృహంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కలిశారు. జిల్లాలో పలు ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జీవో నంబరు 3 పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, సుప్రీంకోర్టులో రిట్‌పిటీషన్ దాఖలు ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎస్‌ను ఎమ్మెల్యే కోరారు. రాష్ట్రంలో బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే గిరిజనులకు జరిగే నష్టాలను కూడా ఆయన సీఎస్‌కు వివరించారు. అరకు నియోజకవర్గంలోని పెండింగ్ రోడ్లకు రూ.వంద కోట్లు నిధులు విడుదల అంశంతో పాటు,మారుమూల బూసిపుట్టు,పెదకోడాపల్లి,మజ్జివలస ప్రాంతాలలో కొత్తగా పీహెచ్‌సీలు మంజూరు చేయాలని కోరినట్టు ఎమ్మెల్యే పాల్గుణ తెలిపారు.

రూ.118 కోట్ల దోపిడీపై నోరు మెదపరేం?

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సీలేరు: డొల్ల కంపెనీల పేరుతో రూ.118 కోట్లు దోచుకున్న చంద్రబాబు, లోకేష్, ఆ బ్యాచ్ దీనిపై ఎందుకు మాట్లాడటం లేదని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రశ్నించారు. శుక్రవారం సీలేరులో విలేకరులతో మాట్లాడుతూ డొల్లకంపెనీల పేరుతో ఐటీ శాఖలో రూ.118 కోట్లు చంద్రబాబు హయాంలో దోచుకున్నట్లు జాతీయ పత్రిక హిందుస్థాన్ టైమ్స్‌లో ఇప్పటికే కథనం వచ్చిందన్నారు. చంద్రబాబు ప్రధాన అనుచరుడైన వాసుదేవ్ ఇంట్లో ఐటీ శాఖ దాడుల నేపథ్యంలో కుంభకోణం విషయంలో ప్రతిపక్షాలు ఎందుకు స్పందించ లేదని నిలదీశారు. రాష్ట్రం అభివృద్ధిలో పయనిస్తున్నా జనసేన, లోకేష్, చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కుంభకోణంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2014లో ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇస్తామని, యువతకు ప్రతినెలా రూ.2 వేల నిరుదోగ్య భృతి ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు సంక్షేమ ప్రభుత్వంపై నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. బూత్ కమిటీలను త్వరలో నియమిస్తామన్నారు. ఎంపీపీ కుమారి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు, స్థానిక సర్పంచ్ దుర్గో, ఉపసర్పంచ్ వల్లీ ప్రసాద్, ఎంపీటీసీ రామ్మూర్తి, పార్టీ జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరిప్రసాద్ పాల్గొన్నారు.

ధారునాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ఫిర్యాదు అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొరపై టీడీపీకి ఎస్టీ సెల్ ధారు నాయక్ నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ సతీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం సర్పంచ్, వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని వ్యక్తి మంత్రిపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఆయన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, జేసీఎస్ మండల ఇంచార్జి కె.రామకృష్ణ, సర్పంచ్‌లు కాకరి బొంజుబాబు పాల్గొన్నారు.



ఏఎస్పీ ధీరాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

పాడేరు రూరల్ : టీడీపీ నేత దారునాయక్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పాడేరు ఏఎస్పీ ధీరజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పీడిక రాజన్నదొరపై అర్థరహిత నిరాధారమైన ఆరోపణలు చేసిన దారునాయక్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.రాంబాబు, ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి రిజ కె.విశ్వ, పాడేరు వైస్ ఎంపీపీ కె. కనకాలమ్మ, కించూరుసర్పంచ్ వి. రాంబాబు, పాడేరు వన్ ఎంపీటీసీ సల్లా చిట్టమ్మ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను గెస్ట్ లెక్చరర్ విధానంపై భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరకులోయ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితం -1, బోటనీ-1, షార్ట్‌హాండ్-1, ముంచంగిపుట్టు కళాశాలలో గణితం-1, బోటనీ, దేవిపట్నంలో తెలుగు-1, రంపచోడవరంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)-1, వి.ఆర్.పురంలో సివిక్స్-1, చింతూరులో ఫిజిక్స్-1, కూనవరంలో తెలుగు-1, నెల్లిపాకలో తెలుగు-1, పాడేరు కళాశాలలో ఇంగ్లిష్-1, ఫిజిక్స్-1, ఎంపీహెచ్ డబ్ల్యూ(ఎఫ్)-2 పోస్టులు భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ పోస్టులకు బీఎస్సీ నర్సింగ్ విద్యార్హతలు ఉండాలన్నారు. గెస్ట్ లెక్చరర్ పోస్టులకు పీజీలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని కలెక్టర్ తెలిపారు.అభ్యర్థులు ఈనెల 22వ తేదీ లోగా పాడేరు ఐటీడీఏ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని, ఈనెల 25న కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇంటర్వ్యూ సమయానికి పోస్టుల సంఖ్య పెరగడం లేక తగ్గే అవకాశాలున్నట్టు పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు చర్యలు

సబ్ కలెక్టర్ శుభం బన్సల్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం : రంపచోడవరం నియోజవర్గ పరిధిలో ఓటర్ జాబితాలో తప్పులు సరి చేయడానికి బూత్ స్థాయిలో ఇంటింటికి వెళ్లి ఓటర్ల సమరణ కోసం తగు చర్యలు తీసుకోవడం జరిగిందని సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఓటరు సవరణ ప్రక్రియపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో 11 మండలాల్లో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల పేర్లు తప్పులు సరిచేసేలా సర్వేకు చర్యలు తీసుకున్నామన్నారు. ఫారం 6 ద్వారా ఓటర్లు నమోదు కోసం 192, ఫారం 7 ద్వారా చనిపోయిన వారి పేర్లు తొలిగించడానికి 129, ఫారం 8 ద్వారా ఓటర్ పేర్లలో తప్పులు, ఫొటోలు సరిగ్గా లేనివాటిని సరిచేయడానికి 213 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఓటర్ జాబితాలో ఏమైన సమస్యలు ఉంటే తమకు తెలపాలని పార్టీ నాయకులకు సూచించారు. 11 మండలాల్లో ఇంటింటి సర్వే 99 శాతం పూర్తయిందన్నారు. ఓటరు సవరణకు సంబంధించిన వివరాలు ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని తెలిపారు.

రెండు కేసుల్లో 920 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

మారేడుమిల్లి : మండలంలో వేర్వేరు కేసుల్లో 920 కిలోల గంజాయిని స్థానిక పోలీసుల స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రాము తెలిపారు. ఒడిశాలోని చిత్రకొండ నుంచి కేరళకు గంజాయిని తరలిస్తున్న ఒడిశాకు చెందిన అభి రుంగూడ, కేరళకు చెందిన నసీబ్, సంజిత్, దుంబ్రిగుడకు చెందిన సెట్టి రాజును అరెస్టు చేశారు. గూడ్స్ కంటైనర్‌లో తరలిస్తుండగా స్థానిక మద్దులూరు శివారులో వారిని పట్టుకున్నారు. 420 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బైక్, వ్యాన్, ఐదు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. మహరాష్ట్ర షోలాపూర్‌కు చెందిన అమోల్ హనుమంత్ పవార్, గణేష్ దేవకర్ అనే ఇద్దరు వ్యక్తులు కారులో గంజాయిని ధారకొండ నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా మద్దులూరు గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారు, సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్టు ఎస్‌ఐ తెలిపారు. రెండు కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.27.60 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



చీడిపుట్టు పాఠశాలలో కుప్పకూలిన ఉపాధ్యాయుడు జంపరంగి లలిత శంకరం



పాడేరులో కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం పొందుతున్న లలితశంకరం (ఫైల్)

తరగతి గదిలో కుప్పకూలిన లలిత శంకరం

పెదబయలు: మండలంలోని గంపరాయి పంచాయతీ చీడిపుట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న జంపరంగి లలితశంకరం (53) గుండెపోటుతో మృతి చెందారు. సాయంత్రం తరగతి గదిలో గుండెపోటుతో కుప్ప కూలిపోయారు. వెంటనే విద్యార్థులు గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన వచ్చి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సీకరి గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సంతాపం తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఎంఈవో, అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

పర్యావరణ పరిరక్షకుడిగా..

ఉపాధ్యాయుడు లలితశంకరం స్వగ్రామం సీకరి గ్రామం, భార్య కన్యాకుమారి సీకరి పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఈయన ముంచంగిపుట్టు మండలం చెరువుపాకలు, పెదబయలు మండలం సంపంగిపుట్టు, కూతంగిపుట్టు పాఠశాలల్లో పనిచేశారు. ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకిత భావంతో పని చేయడంతో రెండు రోజుల క్రితం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2021లో కూడా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. కన్యా శంకరం ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు సహకారం అందిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ ప్రకృతి ప్రేమికుడిగా పేరు పొందారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటేలా ప్రోత్సహించేవారు.

రేపు శరభవరంలో చంద్రయ్య విగ్రహావిష్కరణ



చంద్రయ్య విగ్రహ ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: మండలంలో శరభవరంలో స్వాతంత్ర్య సమరయోధుడు ద్వారబంధాల చంద్రయ్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్టు ఎంపీడీఓ ఎల్. యాదగిరీశ్వరరావు తెలిపారు. అధికారికంగా జరుగుతున్న ఏర్పాట్లను ఆయన గిరిజన సంక్షేమ శాఖ ఏఈ వీరభద్రరావు, మాజీ సర్పంచ్ లక్ష్మణరావులతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, పీఓ సూరజ్ గనోరే, ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, ఎమ్మెల్యే ధనలక్ష్మి, జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీర భద్రరావు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మాజీ డైరెక్టర్ వాడ్రేవు చిన వీరభద్రుడు, విశ్రాంత ఐపీఎస్ అధికారి దూళి లూకరత్నం, చంద్రయ్య యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు సుబ్బారావు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు.

గర్భిణికి తప్పిన ప్రాణాపాయం



గర్భిని ఎస్తేరును డోలీలో గెడ్డను దాటిస్తూ..



జామిగుడ నుంచి అంబులెన్స్‌లో తరలిస్తూ..



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న తల్లీబిడ్డ

- డోలీలో గెడ్డను దాటించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్
- ప్రాణాలకు తెగించి తరలింపు
- ఆస్పత్రిలో సుఖప్రసవం

పెదబయలు : ప్రసవ వేదనతో బాధపడుతున్న గర్భిణిని గెడ్డదాటించి సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జామిగుడ పంచాయతీ గుంజివాడ గ్రామానికి చెందిన పాంగి ఎస్తేరు(28) గురువారం సాయంత్రం పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. అయితే ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గుంజిబాడ-జామిగుడ గ్రామాల మధ్య గెడ్డ పొంగి ప్రవహించడంతో తరలింపునకు అవరోధం ఏర్పడింది. దీంతో ఆమె భర్త పాంగి రఘునాథ్ సమస్యను గ్రామస్తుల దృష్టికి తీసుకువెళ్లాడు. వెంటనే గృహసారథులు వంతాల కృష్ణకుమార్, వంతాల గోవర్ధన్, సచివాలయ కన్వీనర్ జర్సింగి రాంనాయుడు ముందుకు వచ్చారు. గ్రామానికి చెందిన కొంతమంది యువకుల సాయంతో డోలీలో ఆమెను అరకిలోమీటరు మేర మోసి గెడ్డను దాటించారు. జామిగుడ నుంచి రూఢకోట వైద్యాధికారికి ఫోన్ చేయడంతో ఆస్పత్రి అంబులెన్స్‌ను పంపించారు. వెంటనే దానిని పీహెచ్‌సీకి తరలించారు. గురువారం అర్ధరాత్రి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యాధికారి బి.కిశోర్ తెలిపారు. ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను సాహసం చేసి దాటించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్,యువకులను గ్రామస్తులు అభినందించారు.

ఏటీడబ్ల్యూవోకు సన్మానం



ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, వార్డెన్లు

చింతపల్లిరూరల్: అల్లూరి జిల్లా ఉత్తమ ఏటీడబ్ల్యూవోగా జయనాగలక్ష్మి ఇటీవల అవార్డు పొందారు. ఈ సందర్భంగా చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, వార్డెన్‌లు ఆమెను శుక్రవారం ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఇలాంటి సేవలు విద్యార్థులకు అందించి మరిన్ని అవార్డులు అందుకోని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వార్డెన్‌లు పి. వినాయకరావు, గణేష్, నూకరత్నం, గిరిబాబు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు చెల్లించాలి

చింతపల్లి: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఒకసారి తప్పిన వారికి 2024 ఏప్రిల్‌లో పరీక్ష రాసే అవకాశం కల్పిస్తున్నట్లు పెదబరడ ప్రభుత్వ బాలుర పాఠశాల కో–ఆర్డినేటర్ కె.బాలన్న తెలిపారు. పదో తరగతికి ఒక్కో సబ్జెక్టుకు రూ.100లు, ఇంటర్మీడియెట్ ఒక్కో సబ్జెక్టుకు రూ.150లు, ప్రాక్టికల్ ఒక్కో సబ్జెక్టుకు రూ.100లు ఫీజు అక్టోబర్ 15లోగా ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9491606710, 8332936703, 9491902984 నంబర్లకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

ప్రకృతితో మమేకం.. గిరి జీవనం

- ప్లాస్టిక్, పాలిథిన్‌కు దూరం
- విరివిగా వెదురు తట్టలు, బుట్టల వినియోగం

అనంతగిరి: మన్యంలో మారుమూల గిరిజనుల జీవనశైలి వైవిధ్యంగా..ప్రకృతితో మమేకమై... సంప్రదాయ పద్ధతిలోనే దర్శనమిస్తోంది.. ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాలు ఉండడంతో ఇటీవల ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయింది. మన్యంలో రోజురోజుకు పాలిథిన్ వాడకం పెరగడంతో పర్యావరణం కలుషితమవుతుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. రానున్న రోజుల్లో మన్యం అందాలు ఇలా ఉండేయంటూ చరిత్ర చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తోందేమోనని ఆందోళన చెందుతున్నారు..

సంప్రదాయ పద్ధతిలో వంటలు

మారుమూల గ్రామాల్లో గిరిజనులు నేటికి ప్రకృతితో మమేకమై జీవనం సాగిస్తారు. అడవిలో దొరికే వెదురుతో తయారుచేసిన తట్టలు, బుట్టలను ఉపయోగిస్తారు. పొలం పనులకు, సంతల్లో అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలకు వెదురుబుట్టలు, తట్టలనే ఉపయోగిస్తారు. ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉంటారు. వంటలకు మట్టిపాత్రలనే ఉపయోగిస్తారు. నీరు నిల్వచేసేందుకు మట్టికుండాలనే ఉపయోగిస్తారు. వారపు సంతల్లో మట్టికుండలు విక్రయిస్తుంటారు. వెదురు బొంగుల్లో చికెన్‌తో పాటు పలు వంటకాలను వండుకొని తింటారు. ఇలా ప్రకృతితో మమేకమై జీవనం సాగిస్తుంటారు. ప్రసుత్తం పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ చెత్తతో మన్య ప్రాంత ఆహ్లాద వాతావరణానికి విఘాతం కలుగుతోందని పలువురు చెబుతున్నారు. ఆయా ప్రదేశాల్లో ప్లాస్టిక్ నిషేధంపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే మన్యం అందాలను సురక్షితంగా కాపాడుకోవచ్చని చెబుతున్నారు. మన్యంలోని మారుమూల గ్రామాలను ఆదర్శంగా తీసుకుని, ప్లాస్టిక్ నిషేధం పలికితే మంచిదని, ఫలితంగా రానున్న తరాలకు ఆరోగ్యంతో పాటు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందవచ్చని పర్యావరణవేత్తలు ఆశిస్తున్నారు.



వారపు సంతలో గిరిజనులు తట్టలతో తీసుకువచ్చిన అటవీ ఉత్పత్తులు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



బచ్చులూరులో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శివకుమార్

మోతుగూడెం: జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా, చింతూరు సబ్ డివిజన్ ఇన్‌చార్జి కె.మహేశ్వర రెడ్డి (ఓఎస్డీ రంపచోడవరం), ఆదేశాల మేరకు డొంకరాయి పోలీసుస్టేషన్ పరిధిలో బచ్చులూరు గ్రామంలో ఎస్‌ఐ శివకుమార్ శుక్రవారం సందర్శించారు. యువత చదువుపై దృష్టి సారించాలని, ఉన్నత ఉపాధితోనే మంచి గౌరవం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కులధ్రువీకరణ పత్రాలను జారీతో ఉన్నత విద్యకు ఉపయోగపడుతుందన్నారు. యవత వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహలు, సారా వల్ల కలిగే అనర్థాలు, సర్పంచ్ సంధ్యా రాణి, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు కిరండూల్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, గోరాపుర్–అరకు–సిమిలిగుడ స్టేషన్ల పరిధిలో చేపట్టిన భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ–కిరండూల్–విశాఖ పాసింజర్ స్పెషల్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డీఏవిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఆదివారం విశాఖలో బయల్దేరాల్సిన విశాఖ–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు.

తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో 11న బయల్దేరవలసిన కిరండూల్–విశాఖ (08552) పాసింజర్ స్పెషల్ రద్దు చేశామన్నారు.

మారుమూల గ్రామాలకు రహదారులు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, నేతలు

కొయ్యూరు: మారుమూల ప్రాంతాలకు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మర్రివాడ పంచాయతీలో ఆమె శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నిమ్మలగొంది నుంచి గూడెం కొత్తవీధి మండలం కొక్కితపాడు వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ పాడేరు మిషన్ కనెక్ట్‌లో భాగంగా అన్ని ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతోందని, తద్వారా అభివృద్ధి జరుగుతోందన్నారు. ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, తాతారావు, సర్పంచ్ సత్యవతి పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో జంగిల్ క్లియరెన్స్



ఘాట్‌లో తుప్పలు, డొంకలు తొలగిస్తున్న కూలీలు

సాక్షి,పాడేరు: పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లే ప్రధాన ఘాట్‌రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ పనులకు ఆర్అండ్‌బీ అధికారులు తగిన చర్యలు చేపట్టారు. అధిక సంఖ్యలో కూలీలను ఏర్పాటు చేసిన అధికారులు కూలీలతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయిస్తున్నారు. ఇందులో భాగంగా ఘాట్ రోడ్డులో గరికిబంద నుంచి జంగిల్ క్లియరెన్స్ పనులను ఇటీవల ప్రారంభించగా, ఇప్పటికి సగం పనులను కూలీలు పూర్తి చేశారు. మొత్తం 25కిలోమీటర్ల పొడవున రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, డొంకలను తొలగించే పనులను చేపట్టారు. దీంతో ఆయా మార్గాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనుబడుతుండడంతో వాహనచోదకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ హరి వెంకట కుమారి



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

గోపాలపట్నం (విశాఖ) : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం విశాఖ చేరుకున్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జేసీ విశ్వనాథన్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, డీఐజీ ఎస్.హరికృష్ణ, ఏడీసీపీ విద్యాసాగర్ నాయుడు, ఆర్డీవో హుస్సేన్ సాహేబ్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి గవర్నర్ నేరుగా పోర్టు అతిథి గృహానికి వెళ్లారు.

ఉన్నతితో మెరుగైన ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిరుద్యోగ యువతీ, యువతతో ఎంపీడీవో కుమార్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతి కార్యక్రమం ద్వారా జాబ్‌కార్డులోని వందరోజులు పూర్తిచేసిన కుటుంబాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు, అనకాపల్లి, షీలానగర్, పెందుర్తి, వివిధ కంపెనీల్లో శిక్షణ ఇచ్చి, అనంతరం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. అలాగే శిక్షణ కాలంలోని రోజుకు 272 చెల్లిస్తారని తెలిపారు. ఏపీవో సన్యాసినాయుడు, సీడాప్ జాబ్స్ కో–ఆర్డీనేటర్ శ్యామ్, బొజ్జన్న, శివప్రసాద్, సింహచలం, వెంకటరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో సీబీఆర్ఎన్ సెంటర్



విమ్స్ నమూనా గురించి మంత్రికి వివరిస్తున్న వైద్యాధికారులు..

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో కెమికల్ బయోలాజికల్ రేడియోలాజికల్ న్యూక్లియర్(సీబీఆర్ఎన్) సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజని తెలిపారు. శుక్రవారం సాయంత్రం విమ్స్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. వైద్యాధికారులతో కలసి ఆమె ఇక్కడ పలు విభాగాలు పరిశీలించారు. ఇన్‌పేషెంట్ వార్డులు, ఐసీయూలలో పేషెంట్లను పలకరించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొన్నారు. అనంతరం ఆమె రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధరరెడ్డి, డీఎంఈ నర్సింహం, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు. వైద్యాధికారులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విమ్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 10 సీబీఆర్ఎన్‌లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. వాటిలో ఒక సెంటర్‌ను మన రాష్ట్రంలో విమ్స్‌లో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు. విమ్స్‌లో డయాగ్నస్టిక్ సెంటర్, ఆయుష్, ఔషధ నియంత్రణ విభాగం నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు.

13,14 తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా జట్లు ఎంపిక

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 13,14 తేదీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా జట్లు ఎంపిక చేస్తున్నట్లు ఆర్ఐవో రాయల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 13న ఉదయం 10గంటలకు టెన్నీకాయిట్, కబడ్డీ, బాల్ బాడ్మింటన్, 14న వాలీబాల్, త్రో బాల్‌కు ఎంపికలు ఉంటాయన్నారు. చోడవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో వీటిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్–19 క్రీడా జట్లు ఎంపిక కోసం 01–01–2005 తరువాత జన్మించిన వారు అర్హులని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి. రాంబాబు తెలిపారు. ఆయా కాలేజీల నుంచి ఆసక్తి ఉన్న విద్యార్థులను చోడవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంకు తీసుకొచ్చేలా ఫిజికల్ డైరక్టర్లు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

11 నుంచి జైళ్ల శాఖ జాతీయ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ శ్రీనివాసరావు

ఆరిలోవ : జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చి అండ్ డెవెలప్‌మెంట్, ఏపీ జైళ్ల శాఖ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నాయి. ఈనెల 11, 12 తేదీల్లో జరగనున్న ఈ సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో పలు కేంద్ర కారాగారాలు, సబ్ జైళ్ల నుంచి విశాఖపట్నం కేంద్ర కారాగానికి చేరుకొన్నారు. శుక్రవారం ఈ కారాగారాన్ని సందర్శించిన రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు ఆయా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. జాతీయ సదస్సు విజయవంతంగా నిర్వహించడానికి సలహాలు సూచనలు చేశారు. సుమారు 50 మందితో నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులకు జాతీయ సదస్సు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఎవరు ఏఏ పనులు చేపట్టాలో గ్రూపులుగా విభజించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సు విశాఖపట్నంలో రుషికొండ దరి సాయిప్రియ రిసార్ట్స్‌లో రెండు రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జైళ్ల శాఖ డీజీ స్థాయి ఉన్నతాధికారులు ఉమారు 140 మంది వరకు పాల్గొంటారన్నారు. వారందరికీ సాయిప్రియ రిసార్ట్స్‌తో పాటు దీనికి అందుబాటులో ఉన్న వైజాగ్ కన్వెన్షన్‌లో వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్ర హోంశాఖ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా, రాష్ట్ర హోం శాఖామంత్రి తానేటి వనిత హాజరుకానున్నారన్నారు. ముగింపు సదస్సుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్నట్లు తెలిపారు. అతిథులు, అధికారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వివిధ జైళ్లకు చెందిన 50 మంది అధికారులను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. సదస్సులో జైళ్ల శాఖలో గడిచిన 75 ఏళ్లలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకొన్నాయి, ఎలాంటి అభివృద్ధి జరిగింది, ప్రస్తుతం లాంటి అభివృద్ధి చేయాలి అన్న అంశాలపై చర్చ జరగనుందన్నారు. దీంతో పాటు ముఖ్యంగా టెక్నాలజీ ఇన్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్, స్టేటస్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఇన్ ప్రిజన్స్ ఇన్ ఇండియా, మోడల్ ప్రిజన్స్ లెజిస్లేషన్, డీప్ అడిషన్ ఆఫ్ ప్రజనర్స్, ఓవర్ ప్రిజన్స్, అల్టర్నేటివ్స్ టు ఇన్‌కార్సనేషన్ అనే 6 అంశాలపై చర్చిస్తారన్నారు. మన రాష్ట్రంలో జాతీయ సదస్సు నిర్వహించడం ఇది రెండోసారని ఐజీ తెలిపారు.

సదస్సులో ప్రదర్శనలు..

జాతీయ సదస్సులో రెండు రోజులు పాటు జైళ్ల ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్రాలలో కేంద్ర కారాగారాలలో తయారయ్యే అన్ని రకాల ఉత్పత్తులు, జైళ్లకు సంబంధించిన ఫొటో ప్రదర్శన, అరకు కాఫీ ఉత్పత్తులు ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు 'పరివర్తన' పేరుతో ముద్రించిన మ్యాగజైన్ ఆవిష్కరిస్తామన్నారు. జైళ్ల శాఖకు సంబంధించిన వివరాలతో కూడిన 40 పేజీల మెటీరియల్ (బుక్) సదస్సులో పాల్గొన్న అధికారులకు అందజేస్తామన్నారు.

అదుపుతప్పిన కారు

అనంతగిరి: మండలంలోని తైడ జంగిల్స్ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గోతిలో ముందుచక్రం దిగిపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు గంటపాటుగా శ్రమించి, కారును బయటకు తీశారు. ఒడిశా నుంచి నలుగురు వ్యక్తులు కారులో విశాఖ వెళుతుండగా... తైడ జంగిల్స్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పింది. రోడ్డుపక్కనున్న గోతిలో ముందుచక్రం దిగిపోవడంతో ఒకవైపుగా కారు ఒరిగిపోయింది. స్థానికులు యువకులు స్పందించి, గంటపాటు శ్రమించి, వాహనాన్ని బయటకు తీశారు. ఓహెచ్‌సీ కేబుల్ కోసం రక్షణ గోడలను ఆనుకుని గోతులు తవ్వడంతో పడుతున్న భారీ వర్షాలకు రోడ్డుపక్కన పూర్తిగా కోతకు గురైందని, వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కోతకు గురైన ప్రదేశాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఏయూ స్నాతకోత్సవానికి వేళాయె

- తొలిసారిగా ఏయూకు గవర్నర్ అబ్దుల్ నజీర్
- చాన్సలర్ హోదాలో హాజరు
- నేటి మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం



స్నాతకోత్సవ మందిరం

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్నాతకోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాలుగేళ్లకు కలిపి నిర్వహిస్తున్న సంయుక్త స్నాతకోత్సవంలో సైన్స్–పరిశ్రమల రంగంలో అవంతి ఫీడ్స్ ఎం.డి. అల్లూరి ఇంద్రకుమార్‌కు, సాహిత్య రంగంలో ఎస్‌వీ యూనివర్సిటీ పూర్వ వీసీ కొలకలూరి ఇనాక్‌లకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేస్తున్నారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. స్నాతకోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. డాక్టరేట్ డిగ్రీలు, మెడల్స్ తీసుకునే వారికి ప్రత్యేకమైన సీటింగ్ ఏర్పాటు చేశారు. వారికి కేటయించిన నంబర్లలో మాత్రమే వారు కూర్చోవాల్సి ఉంటుంది. వీరితో పాటు వచ్చే కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాట్లు చేశారు. ప్రతీ 20 సీట్లకు ఒక వలంటీర్ సమన్వయం చేయనున్నారు. ఉదయం 10 గంటలనుంచి వీరిని ప్రాంగణంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి ఎవ్వరినీ లోపలికి అనుమతించరు.

690 మందికి పీహెచ్‌డీలు

స్నాతకోత్సవంలో 690 మంది పీహెచ్‌డీలు, 600 మంది వరకు మెడల్స్, ప్రైజ్‌లను తీసుకోనున్నారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు తీసుకునే వారికి అసెంబ్లీ మందిరం వద్ద గౌన్‌లు అందుబాటులో ఉంచుతున్నారు. స్నాతకోత్సవం వీక్షించే వారికి అసెంబ్లీ మందిరంలో ప్రత్యేకంగా ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేస్తున్నారు. స్నాతకోత్సవాన్ని పూర్తిగా యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన భద్రతా సిబ్బంది

గవర్నర్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది శుక్రవారం మధ్యాహ్నం స్నాతకోత్సవ మందిరాన్ని సందర్శించి, భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు.గవర్నర్ ప్రయాణించే వాహనాలతో కూడిన కాన్వాయ్ స్నాతకోత్సవ మందిరానికి వచ్చింది. గవర్నర్ సుమారు రెండు గంటల సమయం ఏయూలో గడపనున్నారు. గవర్నర్ కోసం వేదికకు ఎడమవైపున గ్రీన్‌రూం ఏర్పాటు చేశారు.

కొలకలూరి ఇనాక్

విద్యావేత్తగా, రచయితగా, సామాజిక వేత్తగా, పరిపాలనాదక్షుడిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ సుపరిచితులు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన తమ మేధస్సుతో ఉన్నతంగా ఎదిగారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆయన సేవలు అందించారు. ఆయన స్వస్థలం గుంటూరు జిల్లా వేజెండ్ల. 1939 జూలై 1న ఆయన జన్మించారు. దాదాపు 42 ఏళ్లకు పైగా ఆయన బోధన రంగంలో ఉన్నారు. ఆయన 10 మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టులను, 10 మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టులను చేశారు. ఆయన మార్గదర్శకంలో 24 మంది డాక్టరేట్‌లు స్వీకరించగా, 18 మంది ఎంఫిల్ పూర్తి చేశారు. ఇప్పటికే 200కిపైగా పరిశోధన పత్రాలను వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో సమర్పించారు. దాదాపు ఆరు దశాబ్దాలుగా సాహితీ రంగానికి ఎనలేని సేవలు అందించారు.

అల్లూరి ఇంద్రకుమార్



అవంతి ఫీడ్స్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అల్లూరి ఇంద్రకుమార్ ఉన్నారు. ఆక్వాకల్చర్ రంగంలో ఈ సంస్థ పని చేస్తోంది. 30 ఏళ్లుగా ష్రింప్ ఫీడ్ మ్యానుఫాక్చరింగ్, హేచరీస్, ఫామ్స్, ప్రోసెసింగ్ రంగంలో ఈ సంస్థ పనిచేస్తోంది.భారత దేశంలో ష్రింప్ కల్చర్ ఇండస్ట్రీతో అల్లూరి ఇంద్రకుమార్‌కు అనుబంధం ఉంది. గతంలో మోస్ట్ ట్రస్టెడ్ సీఈవోగా, బెస్ట్ వాల్యూ క్రియేటర్‌గా అవార్డులు అందుకున్నారు. సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా, సీఆర్ రెడ్డి విద్య సంస్థలు, ఏబీఏ పీఆర్ఆర్ కళాశాలల చైర్మన్‌గా సేవలందించారు. అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్‌గా సేవలు అందించారు. పదుల సంఖ్యలో జాతీయ స్థాయిలో అవార్డులను అందుకున్నారు.